జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 16 | మే | 2026 ◆ పేజీలు : 7

## ధాన్యం మరియు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రంను సందర్శించిన ఏ స్పీ రోహిత్ రాజు

- రోహిత్ రాజ్ కి శాలువా కప్పి సన్మానం చేసిన 21 వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు చింతల పూడి సాయి కుమార్ శ్రావణి.



**సుజాత నగర్ ప్రజాజ్యోతి మే 15 :** కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ 21 వ డివిజన్ పరిధిలో గల ధాన్యం మరియు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రంను సందర్శించిన

మిగతా 2 లో...



## వరదలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణపై టేబుల్ టాప్ ఎక్సర్సైజ్

- మే 18న బూర్గంపాడులో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 15 ,(ప్రజాజ్యోతి )** జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్ డిఎంఏ) ఆధ్వర్యంలో వరదలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టేబుల్ టాప్ ఎక్సర్సైజ్ నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీఆర్పీఎఫ్ కమాండెంట్ రితికేష్ ఠాగూర్, జిల్లా ఫైర్ అధికారి క్రాంతి కుమార్ తో పాటు డీఎఫ్ ఓ, పోలీస్, రెవెన్యూ, ఎస్ డీఆర్ ఎఫ్, సాగునీటి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ,ఇతర లైన్ డిపార్ట్ మెంట్ ల అధికారులు ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ డిఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహేల్ మాట్లాడుతూ జిల్లాల్లో వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు లేదా ఇతర విపత్తులు సంభవించిన సమయంలో అధికార యంత్రాంగం వేగంగా, సమన్వయంతో స్పందించేందుకు ముందస్తు సిద్ధత ఎంతో అవసరమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరద ప్రభావిత ప్రాంతంగా గుర్తించబడిన నేపథ్యంలో వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు

మిగతా 2 లో...

## జాతీయ రహదారిపై సంచరిస్తున్న మూగజీవాలు

- వాహనదారులకు పెరుగుతున్న ప్రాణహాని .
- యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్.



**పాల్వంచ, మే 15, ప్రజాజ్యోతి:** పాల్వంచ పరిధిలోని నాగారం కాలనీ వద్ద జాతీయ రహదారిపై ఆవులు, గేదెలు గుంపులుగా సంచరిస్తుండటం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. వేసవి కాలం కావడంతో పశువులకు మేత, నీటి కోసం పాల వ్యాపారస్తులు మరియు యజమానులు వాటిని రోడ్లపై వదిలేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.ప్రత్యేకంగా జాతీయ రహదారిపై వేగంగా ప్రయాణించే వాహనాలు ఈ మూగజీవాలను ఢీకొనే ప్రమాదం ఎప్పటికప్పుడు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటి వేళల్లోనే కాకుండా రాత్రి సమయాల్లో

మిగతా 2 లో...

## సులానగర్ లో పట్టపగలే..
## యథేచ్ఛగా మట్టి తోలకం...

- చేనులు, చెరువులు, కుంటల నుంచి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు ....
- అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం...
- ఓవర్ స్పీడ్ తో ట్రాక్టర్ల దూసుకెళ్తుండటంతో ప్రజల్లో భయం..



**టేకులపల్లి,మే15,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా విపరీతంగా పెరిగిపోయాయని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సులానగర్, టేకులపల్లి, ఆంజనేయపాలెం,కుంటల్లా,

మిగతా 2 లో...

## భద్రాచలంలోని హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై ఆకస్మిక తనిఖీలు

**భద్రాచలం టౌన్, మే 15 ప్రజాజ్యోతి** భద్రాచలంలో పలు హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు. ఈ తనిఖీలలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వంటశాలల నిర్వహణ, నిల్వ విధానాలు, లైసెన్సుల అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా కొన్ని హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాలు సరైన లైసెన్సులు లేకుండా



నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, సంబంధిత యాజమాన్యాలకు ఒక వారం గడువులోగా

మిగతా 2 లో...

# సులానగర్ లో పట్టపగలే యథేచ్ఛగా మట్టి తోలకం...





(మొదటి పేజీ తరువాయి...)

బొమ్మనపల్లి పంచాయతీ పరిధిల్లో గుట్టలు, చెరువులు,పట్టా భూములు నుంచి భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నా యని ప్రజలు ఆరోపిస్తు న్నారు.సులానగర్ సమీప ప్రాంతాల్లో నిత్యం ట్రాక్టర్ల ద్వారా మట్టి రవాణా కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఓవర్ స్పీడ్ తో వాహనాలు వెళ్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఇక చెరువుల్లో పట్టపగలే యథేచ్ఛగా మట్టి తోలకం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండి పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల అండదండలతోనే అక్రమార్కులు మట్టి వ్యాపారం కొనసాగిస్తు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర నిర్మాణ అవసరాల పేరుతో ఒక్క ట్రాక్టర్ మట్టికి రూ.700 నుంచి రూ.800 వరకు వసూలు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు కొనసాగు తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీ నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా చెరువుల పరిరక్షణ దెబ్బతింటోందని,భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడే అవకాశముందని అంటున్నారు. వెంటనే ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి అక్రమ తవ్వకాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. టేకులపల్లి తహ సిల్దార్ ను వివరణ కోరగా మట్టి రవాణాకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అక్రమంగా మట్టి తవ్వకాలు,రవాణా జరుగుతున్నట్లయితే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

## వరదలు, అటవీ అగ్ని ప్రమాదాల నియంత్రణపై టేబుల్ టాప్ ఎక్సర్సైజ్



(మొదటి పేజీ తరువాయి...)

తరలింపు, సహాయక చర్యలు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై ఈ కాన్ఫరెన్స్ లో విస్తృతంగా చర్చించారు.జిల్లాలో అటవీ అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించిన సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో ఎలా స్పందించాలి, అగ్నిమాపక చర్యలను ఎలా చేపట్టాలనే అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.ఈ నెల 18న బూర్గంపాడు మండలంలో నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ ను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎన్ డిఎంఏ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. మాక్ డ్రిల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## ధాన్యం మరియు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రంను సందర్శించిన ఏ స్పీ రోహిత్ రాజు



(మొదటి పేజీ తరువాయి...)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా SP రోహిత్ రాజ్ కి శాలువా కప్పి సన్మానం చేసిన 21 వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు చింతలపూడి సాయి కుమార్ శ్రావణి . తదనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను, వారి సమస్యలను SP రోహిత్ రాజ్ మరియు జిల్లా సివిల్ సప్లై అధికారి దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ ఛైర్మన్ మండే వీరహనుమంతరావు ,వ్యవసాయ అధికారులు,పోలీస్ అధికారులు, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారులు,సొసైటీ బాధ్యులు,మండల రైతులు పాల్గొన్నారు.

## భద్రాచలంలోని హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి...)

లైసెన్సులు పొందాలని సూచించారు. అలాగే హోటల్ ప్రాంగణాలు, వంటశాలలు పరిశుభ్రంగా ఉంచుతూ ఆహార భద్రత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. పరిశుభ్రత లోపాలు గుర్తించిన హోటళ్లకు ఒక వారం గడువు ఇచ్చినట్లు, అనంతరం మళ్లీ తనిఖీలు నిర్వహించి పరిస్థితులను సమీక్షిస్తామని ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో భాగంగా అధికారులు 3 యాక్ట్ నమూనాలు, 9 సర్వైలెన్స్ నమూనాలు సేకరించి ప్రయోగశాలకు విశ్లేషణ నిమిత్తం పంపించినట్లు తెలిపారు. నివేదికలు వచ్చిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షిత ఆహారం అందించడమే లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు.

## బండి సాయి భగీరథ్ అరెస్ట్ చేయాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను భర్తరఫ్ చేయాలని సీపీఎం డిమాండ్




**దమ్మపేట, మే 15(ప్రజాజ్యోతి):** మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు ఒక చట్టం, అధికారంలో ఉన్నవారికి మరో చట్టం ఉండకూడదన్నారు. కేసులో నిందితుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మండల కమిటీ సభ్యులు కొలిక్కిపోగు శ్రీనివాసరావు, ఉసికెల రామకృష్ణ, కె.సుమంత్, కె.వంశీ, డి.కార్తీక్, టి.రాకేష్, కె.రామయ్య, కె.అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ఘనంగా 'లైబ్రరీ డే'




**ములకలపల్లి, మే 14, ప్రజాజ్యోతి:** విద్యా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ములకలపల్లి శాఖా గ్రంథాల యం లో గ్రంథ పాల కు రాలు బి.వాణి ఆ ధ్వ ర్యంలో "లైబ్రరీ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పాఠకులను ఘనంగా సన్మానించారు. గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లలిత రావు, ఎంఈఓ శ్రీ సత్యనారాయణ, గ్రామ పెద్దలు శనగపాటి సీతా రాములు, బండి కొమరయ్య, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై సంచరిస్తున్న మూగజీవాలు



(మొదటి పేజీ తరువాయి...)

చీకట్లో రోడ్లపై కనిపించని గేదెలు, ఆవుల కారణంగా ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన కొందరు తమ పశువులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేస్తుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల వాహనాలు పశువులను ఢీకొన్న ఘటనలు నమోదవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గ్రామ కార్యదర్శులు, పంచాయతీ అధికారులు మరియు పోలీసు శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై పశువులను వదిలే యజమానులకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే జరిమానాలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. మూగజీవాల సంచారం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నా బాధ్యులు నిర్లక్ష్య ధోరణి వీడకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

- ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూత

**దమ్మపేట, మే 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్బన్ కాలనీలో వడదెబ్బ కారణంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. అర్బన్ కాలనీకి చెందిన సోయం రామ్మూర్తి (66), జీసీసీ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. వడదెబ్బ కారణంగా తల తిరిగి పడిపోయిన ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్ లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సోయం ఉమామహేశ్వరరావు ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు క్రైమ్ నెం.112/2026 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# మాతృ శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా పని చేయాలి

- డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 15, (ప్రజాజ్యోతి)** మాతృ శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ జిల్లాలోని పలువురు వైద్యులకు సూచించారు, శుక్రవారం స్థానిక డిఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన చిన్నారుల మరణాలపై రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీలు , బాలింతలకు ప్రసవం అనంతరం పిల్లలు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు నిరంతర ఆరోగ్య విద్య, పోషకాహార సూచనలు, వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వివరించారు. చిన్నారుల మరణాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి మరణానికి దారి తీసిన కారణాలపై విచారణ చేయాలన్నారు, భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు అవసరమైన చర్యలపై సూచనలు సలహాలు అందజేశారు ,జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, సి హెచ్ ఓ , ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ దినోత్సవం



**చర్ల, మే 15(ప్రజా జ్యోతి ):**చర్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక గ్రంథ పరిచయ కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్కూలు విద్యార్థిని, విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులకు సంబంధించిన కొత్తగా వచ్చిన పుస్తకాలను పరిచయం చేశారు. అలాగే దేశ నాయకుల జీవిత కథలు, రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల్లోని విలువలు, నీతులు సంస్కృతిపై వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పుస్తకాలపై తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి రోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాహుల్ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, గ్రంథాలయంలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహణ

- ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 15 ,(ప్రజాజ్యోతి)** జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజిల్లా వ్యాప్తంగా మొత్తం 26 పరీక్షా కేంద్రాలలో గణిత శాస్త్రం పేపర్-1A, బోటనీ పేపర్-1, రాజకీయ శాస్త్రం పేపర్-1 పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షలకు జనరల్ విభాగంలో 2971 మంది, వొకేషనల్ విభాగంలో 217 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 3188 మంది కేటాయించగా, అందులో 3037 మంది హాజరయ్యారని తెలిపారు. జనరల్ విభాగంలో 132 మంది, వొకేషనల్ విభాగంలో 19 మంది కలిపి మొత్తం 151 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. నేడు జరిగే పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## సీఎం, జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించిన మున్సిపల్ అధికారులు

- సమాచార హక్కు చట్టం దరఖాస్తుతో బయటపడిన భారీ అక్రమాలు

**ఇల్లందు, మే 15, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో రహదారి అక్రమ సమస్యపై సుమారు 150 కుటుంబాల ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సంతకాల తో కూడిన ఫిర్యాదు చేయడం జరిగిందని, ఈ ఫిర్యాదు పై సీఎం కార్యాలయం స్పందించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు సూచనలు చేయడం జరిగిందని బస్తీ వాసులు తమటం కళ్యాణి, ఎస్ కె రజియా, భద్రమ్మ, బొబ్బి రాంబాయి, బి విజయ, బోశాల ఉపేంద్ర, కమల, వరలక్ష్మి, కొండపల్లి ఉమా, లింగాల రాణి, బానోతు స్వరూప, సరికొండ పద్మ, బోశాల నిర్మల లు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఈ ఫిర్యాదు పై జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ లను సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రెండు సంవత్సరాలు గడిచిన ఆదేశాలు అమలు కాకపోవటం, ఇల్లందు మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు తహసిల్దార్ ను తెలియకుండా ఏకపక్షంగా అక్కడి రహదారిలేదని తప్పుడు నివేదికలు తయారుచేసి పై అధికారులకు పంపించడం జరిగిందని ఆరోపించారు. ఈ విషయంపై బాధిత ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసి, సీఎం కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులు, జిల్లా కలెక్టర్ పంపిన లేఖలు, వాటిపై తీసుకున్న చర్యలపై నివేదికలు ఇవ్వాలని కోరడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఆర్టీఏ దరఖాస్తు చేసిన అనంతరం అసలు విషయాలు బహిర్గతం అయ్యాయని, సీఎం, జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా రెండు సంవత్సరాల పాటు కాలయాపన చేసి తహసిల్దార్ ను సంప్రదించకుండా తప్పుడు నివేదికలు తయారు చేసిన వ్యవహారం బయటపడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు తహసిల్దార్ లెటర్ తర్వాత ఇస్తామని, ఫైళ్లు తర్వాత చూపిస్తామంటూ మాట మారుస్తున్నారని, గతంలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ప్రజలను తప్పుదారి పట్టించేలా తప్పుడు నివేదికలు ఇచ్చిన మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నదా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

## కే ఓ సి ఓ బి కార్మికులకు ఈపీఎఫ్ వెంటనే చెల్లించాలి

- ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం డి రాసుద్దిన్



**టేకులపల్లి,మే15,ప్రజాజ్యోతి** కోయగూడెం ఓపెన్ కాస్ట్ లో ఓబి విధులు నిర్వహిస్తున్న డ్రైవర్స్, హెల్పర్స్ బ్లాస్టింగ్ తదితర విభాగాల కార్మికుల కు ఈపీఎఫ్ గత 12 నెలల నుండి జమ కావడం లేదని వాటిని వెంటనే కార్మికుల ఈపీఎఫ్ ఖాతాలో జమ చేయాలని కోరుతూ శుక్రవారం కొత్తగూడెం ఏజిఎం పర్సనల్ అధికారిని ఐఎఫ్టియు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర అధ్యక్షులు ఎం డి.రాసుద్దీన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్. సంజీవ్ లు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోయగూడెం ఎల్ ఎస్ ఎన్ కంపెనీ ఓ బి లో సుమారు 300 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని వారి ఖాతాలలో ఈపీఎఫ్ సుమారు 12 నెలల నుండి జమకావటం లేదని వారు ఆరోపించారు.సింగరేణి అధికారులకు అనేకమార్లు వినతి పత్రాలను అందజేసినప్పటికీ, దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారన్నారు. రాత్రనకా పగలనకా కష్టపడ్డా కార్మికుల ఈపీఎఫ్ డబ్బులను ఖాతాలలో జమ అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో (ఐ ఎఫ్ టి యు )రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్, ఇల్లందు ఏరియా అధ్యక్షులు రావూరి ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బడి బాటను విజయవంతం చేద్దాం

- తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మ



**టేకులపల్లి,మే15, ప్రజాజ్యోతి :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ రూపొందించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి బడికి వెళ్లే పిల్లల సంఖ్య తెలుసుకుంటూ, స్కూల్‌కు వెళ్లని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ బాల కార్మిక నిర్మూలనకై కృషి చేస్తున్నారు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహనా ర్యాలీని, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు అని ఆయన తెలిపారు. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, డిజిటల్ స్మార్ట్ బోర్డ్, నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని వారి తల్లిదండ్రులకు అర్థం అయ్యే విధంగా తెలుపుతున్నామని ఆయన తెలిపారు.

## త్రాగునీటి సమస్య పరిష్కరించండి

- మాజీ సర్పంచ్ కారం కన్నరావు ఆధ్వర్యంలో నిరసన



**చర్ల, మే 15(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గోరుకొండ గ్రామంలో గత మూడు వారాలుగా త్రాగునీటి సమస్య తీవ్రంగా మారింది . గ్రామంలో త్రాగునీరు అందక స్థానిక ఆదివాసీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు, పాలకవర్గ ప్రతినిధులకు తెలియజేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం మాజీ సర్పంచ్ కారం కన్నరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గోరుకొండ వాటర్ ట్యాంక్ సమీపంలోని రహదారిపై ధర్నా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కారం కన్నరావు మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు తక్షణమే త్రాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఐటిడిఏ పీవో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.గ్రామ పెద్దలు చిన్న ముస్కీ, భీమా ముస్కీ, దేవ పోడియం, దేవ కలము, లక్మా మాదివి, దుల్లయ్య, గట్టుపల్లి రాజు తదితరులతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## స్వర్ణభద్రవకాచలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

- గత ఏడాది మీద ఏప్రిల్ నెలలో తగ్గిన భక్తుల సంఖ్య



**భద్రాచలం టౌన్ , మే 15 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్రవకాచలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణ దారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఇదిలా ఉండగా ఏప్రిల్ నెలలో స్వామి వారిని 1,81,062 మంది భక్తులు దర్శించుకున్నారు. కాగా గత ఏడాది మే నెలలో మాత్రం 2,78,730 మంది దర్శకున్నారు. విపరీతమైన ఎండలు ఉండటంతో భక్తుల సంఖ్య తగ్గిందని దేవస్థానం వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఇసుక సొసైటీల్లో అక్రమాలు అరికట్టాలి

- ఆదివాసి మహిళా సొసైటీ సభ్యుల ఆందోళన



**చర్ల, మే 15(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ కొమరం భీమ్ ఆదివాసి మహిళా ఇసుక సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు ఎలకం రామకృష్ణ మాట్లాడుతూ సుబ్బంపేట గ్రామపంచాయతీ పరిధిలోని బీఎస్ రామయ్య నగర్ శ్రీ కొమరం భీమ్ ఆదివాసి మహిళా ఇసుక సొసైటీలో గతంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు.సొసైటీ వ్యవహారాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. డీసీఓ కార్యాలయం నుండి విచారణకు వచ్చిన అధికారులు నివేదికను బయట పెట్టలేదని అలాగే ప్రస్తుత కమిటీని రద్దు చేయాలని కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.'మ్యాక్స్ సొసైటీ' పేరుతో గిరిజనేతర బ్రోకర్లు, రైసింగ్ కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్న వర్గాలకు మాత్రమే మద్దతు ఇస్తూ అసలు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కారణంగా ప్రశాంతంగా ఉన్న ఆదివాసీ గ్రామాల్లో విభేదాలు, గొడవలు సృష్టిస్తున్నారని అన్నారు.హైకోర్టులో కేసు నంబర్ 2713/2026 పెండింగ్‌లో ఉన్నప్పటికీ కొమరం భీమ్ ఆదివాసి మహిళా ఇసుక సొసైటీకి టీజీఎండీసీ పీఓ ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుత కమిటీపై గతంలోనే టీజీఎండీసీ పీఓ, మైనింగ్ ఏడీకి సభ్యులు ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని పట్టించుకోకుండా గిరిజనేతర బ్రోకర్లకు అధికారులు మద్దతు ఇస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఆదివాసీ హక్కులను పరిరక్షించాలని ఇసుక సొసైటీల్లో గిరిజనేతరుల జోక్యాన్ని వెంటనే అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎలకం ఆదినారాయణ, సోడి సురేష్, పోడియం జ్యోతి, రేగా తులసమ్మ, పూణెం వరప్రసాద్, వుయిక సంగీత, రేగా పార్వతి, సోడి దేవి, పోడియం వీరమ్మ, సబ్కా దేవి, ఎలకం ఈశ్వరి, పోడియం సరస్వతి, రేగా ఆంధ్రయ్య, ఎలగల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా.. మహిళ మృతి

- ఏడుగురికి తీవ్రగాయాలు
- ఆలస్యంగా స్పందించిన పామేడ్ పోలీసులు





**చర్ల, మే 15(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తోగ్గూడెం గ్రామం సమీపంలో గురువారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి చర్లకు వచ్చి ట్రాక్టర్ ద్వారా గ్రామానికి సిమెంట్ తరలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడంతో అదుపుతప్పి ట్రాక్టర్ ఇంజన్‌తో పాటు ట్రైలర్ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.ఈ ప్రమాదంలో ట్రైలర్‌పై ప్రయాణిస్తున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యామ్లసోను అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడగా వారిని చికిత్స నిమిత్తం పామేడ్ వైద్యశాలకు తరలించారు.ప్రమాద స్థలం పామేడ్ పోలీస్ స్టేషన్‌కు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ పోలీసులు శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సంఘటనా స్థలానికి చేరుకోకపోవడం విమర్శలకు దారితీసింది. సమీపంలోని 218 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది ఘటనను గమనించి వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పామేడ్ పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి హామీ పనుల పరిశీలన

- ఉపాధి కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి: ఎంపీడీవో ఈదయ్య



**చర్ల, మే 15(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం చిన్న మిడిసిలేరు గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పనులను శుక్రవారం అధికారులు సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని చెరువులో చేపడుతున్న పూడికతీత పనులను ఎంపీడీవో ఈదయ్య ప్రత్యక్షంగా పరిశీలించి పనుల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. అధికారులు పనుల పురోగతి, కూలీల హాజరు నమోదు విధానం, పనుల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో ఈదయ్య అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు విశ్రాంతి కో సం టెంట్ ఏర్పాటు చేయడం, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచ డం, అత్యవసర పరిస్థితుల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కూలీల ఆరోగ్యం భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే కూలీల హాజరును మొబైల్ ద్వారా నమోదు చేసే ఎన్.ఎం.ఎం. ఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) విధానాన్ని పరిశీలించి, హాజరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని సం బంధిత సిబ్బందికి తెలిపారు. పనులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో కొనసాగాలని ప్రతి కార్మికుడికి సముచిత ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పనులు ఎంతో దోహదపడతాయని చెరువుల పూడికతీత ద్వారా భూగర్భ జలాల స్థాయి పెరగడంతో పాటు రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ శ్యామల సీత , ఈజీఎస్ ఏపీవో సాంబశివరావు , పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సర్వేశ్వర రావు, గ్రామ ప్రజలు, ఉపాధి కూలీలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## తక్షణమే సహకార సంఘం ఎన్నికలు జరిపించాలి

- తహశీల్దార్ కార్యాలయంలో రైతుసంఘం జిల్లా నాయకుల వినతి



**బూర్గంపహాడ్, మే 15 (ప్రజా జ్యోతి):** తక్షణమే సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర రైతుసంఘం పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కు ఆ సంఘం జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి పాండవుల భిక్షం, సీపీఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావులు మాట్లాడుతూ ప్రభుత్వం అప్రజాస్వామికంగా పాలకవర్గాన్ని కొనసాగించాలని మంత్రి వర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.13 మంది సభ్యుల పాలకమండలి సభ్యులను అధ్యక్ష, డైరెక్టర్ పదవుల్లో నామినేటెడ్ చేసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తక్షణమే సహకార సంఘం ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి మల్సూర్, భూక్యా శ్రీను, సింగంబోయిన వెంకటేశ్వర్లు, ఎట్టి భద్రు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్. కొత్తగూడెంలో కోర్రాజుల జాతర

మే 28 నుంచి కోర్రాజుల మహోత్సవం



**చర్ల, మే 15(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం ఆర్. కొత్తగూడెం గ్రామంలో నాయకపోడ్ తెగ ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ కోర్రాజుల వారి జాతర మహోత్సవం ఈ నెల 28వ తేదీ నుండి జూన్ 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.నాయకపోడ్ గిరిజనుల ఆచార సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే ఈ జాతరలో కోర్రాజుల దేవతకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. జాతర సందర్భంగా దేవతను ఎరుపు, తెలుపు వస్త్రాలతో అలంకరించి, తలపై గిరిజన ఆచార ప్రతీకలైన గుమ్మెళ్ళతో పూజించడం ఈ మహోత్సవ ప్రత్యేకతగా భావిస్తారు.ప్రతి ఏడాది నిర్వహించే ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. జాతర కాలంలో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. భక్తులు, గ్రామ ప్రజలు, సమీప ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొని కోర్రాజుల స్వామి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

## జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ను ఎందుకు తీసుకురావడం లేదు?

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సరి కాదు వేల్పుల భాస్కర్
- పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలపై మరింత ఆర్థిక భారం వేల్పుల భాస్కర్

**సుజాత నగర్ ప్రజాజ్యోతి మే 15 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపినట్లేనని మాదిగ ఐక్యవేదిక సుజాతనగర్ మండల అధ్యక్షులు వేల్పుల భాస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో తగ్గించాల్సిన ఇంధన ధరలను పెంచడం ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.దేశమంతటా ఒకే పన్ను విధానం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ను ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఈ ఇంధనాలను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే వాటి ధరలు గణనీయంగా తగ్గి సామాన్య ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాంటి నిర్ణయాలు తీసుకోకుండా ప్రస్తుతం ఉన్న ధరలను మరింత పెంచడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనన్నారు. "మూలిగే నక్క మీద తాటి పండు పడ్డ చందంగా" ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇంధన ధరల భారం మోయలేనిదిగా మారిందన్నారు. ధరలు పెంచాలనుకున్నప్పుడు ప్రభుత్వాలు తమ వాటాలో కోత విధించుకోవాల్సిందిపోయి ప్రజలపై భారం మోపడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని సూచించారు.ఇటీవల దేశవ్యాప్తంగా ఏర్పడిన ఇంధన కొరత పరిస్థితులు కూడా ధరల పెంపు కోసమేనా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రజల ఆర్థిక పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉందని, ఈ పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పేద సామాన్య మధ్య తరగతి ప్రజలకు రైతుల కు మరింత మోయలేని భారమవుతుందన్నారు.కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని పాలకులను డిమాండ్ చేశారు.పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకపోతే ధర్నాలు జరుగుతాయి అని చెప్పారు.



# కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కష్టాలు

- దళారుల దందాకు ప్రభుత్వమే కారణమా..?
- ధాన్యం అమ్ముకోలేక రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే రైతుల నిరీక్షణ..
- మద్దతు ధరలు కాగితాలకే పరిమితం..
- ప్రభుత్వంపై టీడీపీ నేత కనగాల అనంతరాములు తీవ్ర విమర్శలు..



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ ,మే 15,(ప్రజాజ్యోతి)** పాల్వంచ పరిధిలోని వేటచెరువు, బంగారుజాలు, శ్రీనివాస కాలనీ, గుడిపాడు, కొత్తూరు, పిల్లవాగు తదితర గ్రామాల రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు...మరోవైపు ధాన్యం తడిసిపోతుందేమోనన్న భయం...కానీ కొనుగోలు మాత్రం జరగని పరిస్థితి నెలకొంది.ఈ పరిస్థితిని పరిశీలించేందుకు గురువారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు క్షేత్రస్థాయిలో రైతులను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు.

### ››› 90 శాతం ధాన్యం దళారుల చేతికి..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతుల వద్ద ఉన్న ధాన్యంలో దాదాపు 90 శాతం వరకు ప్రైవేట్ దళారులు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మద్దతు ధర ప్రకటిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ, రైతుకు ఆ ధర అందడం లేదన్నారు.పత్రికల్లో ప్రకటనలు...సభల్లో హామీలు...కానీ రైతు చేతిలో మాత్రం నష్టాలే అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజులు గడిపినా పట్టించుకునే వారు లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

### ››› అప్పుల ఊబిలో రైతులు..

వరి, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులతో అప్పులపాలయ్యారని, ఇప్పుడు ధాన్యానికి సరైన ధర లేక మరింత కష్టాల్లోకి నెట్టబడుతున్నారని తెలిపారు. తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకుని రైతులు దళారుల చేతిలో మోసపోతుంటే ప్రభుత్వం మౌనంగా చూస్తోందని ఆరోపించారు.

### ››› అధికారుల పరిశీలనలు కేవలం ఫోటోలకేనా..?

కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నామని చెబుతున్నప్పటికీ, రైతులకు ఉపయోగపడే చర్యలు మాత్రం కనిపించడం లేదన్నారు. పరిశీలనలు ఫోటోలకే పరిమితం... రైతు సమస్యల పరిష్కారం మాత్రం శూన్యం అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### ››› రైతు ఓటుతో గెలిచి... రైతునే మోసం చేస్తున్నారా..?

రైతులకు అండగా ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు అదే రైతును కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయించే పరిస్థితికి తీసుకువచ్చింది అని కనగాల అనంతరాములు విమర్శించారు. రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి భవిష్యత్తులో రైతులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ సందర్భంగా సొసైటీ మాజీ డైరెక్టర్ జరబన్న సీతారాములు, కొంటెముక్కుల శ్రీనివాసరావు, గంగవరపు సుధాకర్ తదితరులు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు.

### ››› వెంటనే చర్యలు తీసుకోవాలి

రైతుల ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, మద్దతు ధర పూర్తిగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రైతు ఆగ్రహం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# బండి సంజయ్ ని మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలి

- బండి భగీరథ ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి
- సిపిఐఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి
- సిపిఐఎం ఆధ్వర్యంలో ప్ల కార్డులతో నిరసన



**భద్రాచలం టౌన్ , మే 15 ప్రజాజ్యోతి** మైనర్ బాలికపై జరిగిన హత్యాచారం కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుండి బండి సంజయ్ ని బర్తరఫ్ చేయాలని, మైనర్ బాలికపై అత్యాచారం చేసి స్వేచ్ఛగా తిరుగుతున్న బండి భగీరథుని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. బండి భగీరథ విషయంలో తెలంగాణ పోలీస్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఐ ఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో ప్ల కార్డులతో నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో గడ్డం స్వామి మాట్లాడారు. కేంద్ర హోం సహాయ మంత్రి కుమారుడు తన కుమార్తెను సంవత్సరకాలంగా అత్యాచారం చేస్తున్నాడని ఓ తల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన నేటి వరకు పోలీసులు సరైన స్థాయిలో స్పందించడం లేదని అన్నారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయటం తీవ్రమైన నేరమైనప్పటికీ బండి సంజయ్ కుమారుడికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అధికారం చేపట్టిన నాటినుండి ఆడపిల్లలపై చిన్నారులపై దేశవ్యాప్తంగా ప్రతిరోజు ఎక్కడో ఒక చోట అత్యాచారాలు హత్యలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పుడు స్వయానా కేంద్ర సహాయ హోం మంత్రి కొడుకే మైనర్ బాలికపై అత్యాచారం చేశారని అన్నారు. ఈ కేసును పక్కదోవ పట్టించేందుకు బండి సంజయ్ తనకున్న పలుకుబడిని ఉపయోగిస్తున్నారని అన్నారు. బండి సంజయ్ కి ఒక న్యాయం సామాన్యుడికి ఒక న్యాయం తెలంగాణలో సాగుతుందని గడ్డం స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ బాలిక అత్యాచార ఘటనపై సిపిఐ ఎం తోపాటు అనుబంధ ప్రజా సంఘాలు ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయని వెంటనే బండి భగీరథుని అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి నకిరేకంటి నాగరాజు ధనకొండ రాఘవయ్య కుంజా శ్రీనివాస్ అజయ్ కుమార్ ఫిరోజ్ సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ డివైఎఫ్ఐ కార్యదర్శి సతీష్ బాబు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రవీందర్ సీనియర్ నాయకులు జె ఎల్ పి దాస్ కొర్సా రవి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- 26న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను విజయవంతం చేయాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ పిలుపు




**కొత్తగూడెం, మే 15 ( ప్రజాజ్యోతి )** స్థానిక బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన లంబాడి హక్కుల పోరాట సమితి ( ఎల్. హెచ్. పి. ఎస్ ) జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో న్యాయవాది, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఆగస్టులో చేవెళ్ల ప్రజాగర్జన సభ వేదికగా ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో గిరిజన సంక్షేమానికి సంబంధించి పలు హామీలు ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం ప్రభుత్వ ఉద్యోగాలను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కుల సాధన, ఎన్నికల హామీల అమలు కోసం ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా–చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలలో అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతి ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం, భూమిలేని గిరిజనులకు మూడు ఎకరాల భూమి పంపిణీ, అసైన్డ్ మరియు పోడు భూములపై పూర్తి యాజమాన్య హక్కులు, ఇళ్లు లేని గిరిజనులకు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల సాయం, ప్రభుత్వ ప్రయోజనాలు పొందే ప్రైవేట్ సంస్థల్లో ఎస్టీలకు రిజర్వేషన్లు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 12 శాతం రిజర్వేషన్లు, విద్యా జ్యోతులు పథకం ద్వారా 10వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం, ప్రతి మండలానికి ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు, గిరిజనుల కోసం రూ.500 కోట్ల బడ్జెట్‌తో మూడు ప్రత్యేక కార్పొరేషన్లు, తండాల అభివృద్ధికి ప్రతి ఏడాది రూ.25 లక్షలు, ఐదు కొత్త ఐటిడీఏల ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయని గుర్తుచేశారు.



ఈ హామీలను నమ్మి లంబాడీలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చినా రాష్ట్ర కేబినెట్‌లో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అందుకే గిరిజనులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ నాయక్, ప్రసాద్ నాయక్, మంగీలా నాయక్, బాలాజీ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**భద్రాచలం టౌన్ , మే 15 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యా వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈ రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, విద్యార్థులు కూచిపూడి నృత్యంతో అలరించారని అన్నారు. అలాగే బీ జెడ్ సి ఫస్ట్ ఇయర్ నందిని దేశభక్తి గీతం , కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుబ్బరాజు ఏకపాత్రాభినయంతో ఆహుతులను ఆనందపరిచారని అన్నారు. అనంతరం గ్రంథాలయ ఉత్సవాలలో భాగంగా భద్రాచలం గ్రంథాలయం అధికారి జానీ పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయం యొక్క ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలియజేసిన అనంతరం విద్యార్థులకు మెమొంటోలు బహూకరించటం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందూరి రాంబాబు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- ఇసుక టిప్పర్ స్వాధీనం.. పలువురిపై కేసులు నమోదు

**దమ్మపేట, మే 15(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామ శివారులో తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ లారీని దమ్మపేట పోలీసులు శుక్రవారం ఉదయం పట్టుకొని కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుక్కునూరు మండలం దాచారం ఇసుక ర్యాంపు నుండి బయలుదేరిన టిప్పర్ లారీ అశ్వరావుపేట మీదుగా దమ్మపేట మండలం ముష్టిబండ ప్రాంతానికి చేరుకున్న సమయంలో తనిఖీలు నిర్వహించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.ఇసుకతో నిండిన టిప్పర్ లారీని స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అక్రమంగా ఇసుక లోడ్ చేయించిన వారు, రవాణా నిర్వహించిన వారు, లారీ యజమాని, ఇసుక దిగుమతి చేసుకునే వారిపై కూడా కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా, వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు.

# చర్ల సీహెచ్‌సీలో ఒకేరోజు ఐదు ప్రసవాలు




**చర్ల, మే 15:(ప్రజా జ్యోతి ):** చర్ల మండల సామాజిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌సీలో శుక్రవారం అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఒకే రోజు ఐదుగురు గర్భిణీలకు విజయవంతంగా ప్రసవాలు నిర్వహించి వైద్య సిబ్బంది తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు. ఇందులో ఇద్దరు మహిళలకు సాధారణ ప్రసవం జరగగా, మరో ముగ్గురికి శస్త్రచికిత్సల ద్వారా సురక్షితంగా ప్రసవాలు నిర్వహించారు. గర్భిణీలకు వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రావణి, మత్తుమందు వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో అత్యంత జాగ్రత్తగా ఆపరేషన్లు నిర్వహించారు.

తల్లులు, శిశువులు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా శుక్రవారం ఇద్దరు గర్భిణీలకు ఆడ శిశువులు జన్మించడంతో వారి కుటుంబాల్లో ఆనంద వాతావరణం నెలకొంది. గతంలో చర్ల మండలంతో పాటు సరిహద్దు గ్రామాల గర్భిణీలు ప్రసవాల కోసం భద్రాచలం, కొత్తగూడెం వంటి దూర ప్రాంత ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో సమయానికి వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొనేవారని స్థానికులు చెబుతున్నారు.

అయితే ఇటీవల చర్లలో సీహెచ్‌సీ సేవలు మెరుగుపడడంతో స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు.

అదనంగా మరో ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులను ఆసుపత్రికి నియమించడం ద్వారా వైద్య సేవలు మరింత బలోపేతం అవుతున్నాయని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంత ప్రజలకు చర్ల సీహెచ్‌సీ ప్రస్తుతం ప్రధాన వైద్య కేంద్రంగా మారుతుండగా గర్భిణీలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం





**ములకలపల్లి మే 14, ప్రజాజ్యోతి:** గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కులు మరియు సంరక్షణపై మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ సభల్లో బాలల భాగస్వామ్యాన్ని పెంచడం, పిల్లల చదువులపై తల్లిదండ్రుల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడం, బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించేలా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. బాలల సంరక్షణ, విద్యాభివృద్ధి కోసం గ్రామస్థాయి నుంచి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పొగళ్లపల్లి సర్పంచ్ రవి, సర్పంచ్ పద్మ, మాదారం సర్పంచ్ సుజాత, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, గుడ్ షెప్పర్డ్ సిస్టర్స్ ఉదయ, దీప్తి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు మరియు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## బండి భగీరథను అరెస్టు చేసి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి

- మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూప భాస్కర్
- పిఓడబ్ల్యూ- పివైఎల్ ప్రజాసంఘాల నిరసన




**ములకలపల్లి మే 14, ప్రజాజ్యోతి:** బండి భగీరథ ను అరెస్టు చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని శుక్రవారం మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సంయుక్త మండల కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూప భాస్కర్, ప్రగతిశీల యువజన సంఘ జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ, మాట్లాడుతూ కేసుపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సోషల్ మీడియాలో అపోహలు ప్రచారం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన పోక్సో కేసులో బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నుపా సరోజిని, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు బండారు నాగేంద్ర బాబు, రైతు సంఘం మండల కార్యదర్శి ఎర్రగొర్ల రామారావు, సవలం శివ, నరేందర్, సోయం దేశయ్య, బొగ్గం రాజేష్, గడ్డం వెంకటేష్, కొండ్రు శ్రీను, రమేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌లకు నామినేటెడ్ పాలక మండళ్లు అప్రజాస్వామికం

- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి : సీపీఐ నేత ముత్యాల విశ్వనాథం.





**పాల్వంచ, మే 15, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో పాలక మండళ్లను ఏర్పాటు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ రాష్ట్రంలోని 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలక మండళ్ల నియామకం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల్లో పాలకపార్టీకి చెందిన వ్యక్తులను అధ్యక్షులు, డైరెక్టర్లుగా నియమించేందుకు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ్‌హెచ్ ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. సహకార సంఘాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సీసీఐ కేంద్రాల వద్ద సరిపడా గన్నీ బస్తాలు అందుబాటులో ఉంచాలని, తరుగు పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని, లారీల కొరతను నివారించి రైతులకు రసీదులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లాసమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుండాల నాగరాజు, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వైయస్ గిరి, వాడే లక్ష్మి, కొంగర అప్పారావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఎస్‌ఏ రహిమాన్, మన్యం వెంకటేశ్వర్లు, ఎస్‌కే గౌస్, జానీ, కరీం తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి సహకరించాలని మంత్రి తుమ్మలకు వినతి

- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంపై పంచాయతీ పాలకవర్గం అభినందనలు



**అన్నపురెడ్డిపల్లి, మే 15, ప్రజా జ్యోతి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం అన్నపురెడ్డిపల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పూలమాల వేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం గ్రామ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి పాలకవర్గం సమిష్టిగా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పెద్దలు సుగ్గల నరసింహారావు, చల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి మండల సిపిఐ ఆర్గనైజర్‌గా మోరంపూడి నాగేశ్వరరావు ఎన్నిక





- *సభ్యత్వాల విస్తరణతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతల పిలుపు

**అన్నపురెడ్డిపల్లి, మే 15, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సిపిఐ మండల ముఖ్య సమావేశంలో అన్నపురెడ్డిపల్లి మండల నూతన ఆర్గనైజర్‌గా మోరంపూడి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ కార్యదర్శి షాబీర్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వాల విస్తరణ, మండల స్థాయిలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా షాబీర్ పాషా మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకత్వం కార్యకర్తలతో సమన్వయంగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఓకే నారాయణ, సహాయ కార్యదర్శి పలగాని రామకృష్ణ, చంటిగుంట సిపిఐ మండల అధ్యక్షుడు బొర్రా కేశవులు, జిల్లా పార్టీ సభ్యులు జడ శీను తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు పార్టీ కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

# తాండ్ర లలితాదేవి మృతి పట్ల కాంగ్రెస్ నాయకుల సంతాపం.

- పొగళ్లపల్లిలో కుటుంబ సభ్యులను పరామర్శించిన కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, మే 15, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పొగళ్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు దివంగత తాండ్ర నారాయణరావు సతీమణి తాండ్ర లలితాదేవి ఇటీవల మృతి చెందడంతో పలువురు రాజకీయ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పొగళ్లపల్లి గ్రామంలోని ఆమె స్వగృహానికి రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తో పాటు పాల్వంచ కాంగ్రెస్ నాయకులు వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుమారులు తాండ్ర దిలీప్, ఎన్ఆర్ఐ, టీఎన్ఆర్ ట్రస్ట్ అధినేత తాండ్ర వెంకటేశ్వరరావు, ములకలపల్లి సొసైటీ అధ్యక్షులు నడిపల్లి సునంద, అల్లుడు నడిపల్లి నవీన్ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. లలితాదేవి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు వై. వెంకటేశ్వర్లు, సీపీఐ పార్టీ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో ప్రతిభావంతుల విద్యార్థులకు ఘన సన్మానం





- --గ్రంథాలయ దినోత్సవంలో పఠనాసక్తి ప్రాముఖ్యతపై అతిథుల సందేశం

**పాల్వంచ, మే 15, ప్రజాజ్యోతి:** విద్యా వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మూర్తి, ఒకటవ డివిజన్ కార్పొరేటర్ యస్.సుగుణ, జడ్పీహెచ్ఎస్ బొల్లోరుగూడెం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బి. భవానీ శేఖర్, స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ కరస్పాండెంట్ జి. భాస్కర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల మేధో వికాసానికి మూలస్తంభాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. నేటి డిజిటల్ యుగంలో కూడా పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించే ఉద్దేశంతో ప్రత్యేక పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడంతో పాటు నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అతిథులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. జడ్పీహెచ్ఎస్ బొల్లోరుగూడెంకు చెందిన సిహెచ్ హరిత 521 మార్కులు సాధించగా, స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ విద్యార్థినులు గుమ్మళ్ల జయలేఖ 568 మార్కులు, గంగుల ఈషితా శ్రీ రెడ్డి 521 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉద్యోగార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రంధాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు

**టేకులపల్లి,మే15,ప్రజాజ్యోతి:** గ్రంధాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయ   ని మండల వెటర్నరీ డాక్టర్ అనిల్ పేర్కొన్నారు. విద్యా వారోత్స   వాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయజ్ఞానోత్సవాన్ని నిర్వహించారు. టేకులపల్లి గ్రంథపాలకుడు ఆర్ నాగన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వెటర్నరీ డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్ని,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంధాలయాలను బాగా ఉపయోగించుకోవాలని కోరారు.గ్రూప్ వన్,గ్రూప్ టు ప్రిపరేషన్ అయ్యే విద్యార్థులకు కాంపిటేటివ్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గ్రంధాలయంలో అప్డేట్ పుస్తకాలు పుస్తకాలు ఉన్నాయి. హైదరాబాద్, ఖమ్మం,కొత్తగూడెం వెళ్లకంటే మన ఊరిలోని గ్రంధాలయంలో మనకి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి అని ఆయన తెలిపారు.గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు.ఉప సర్పంచ్ వసంతమ్మ మాట్లాడుతూ గ్రంథాలయంలో ప్రతి ఒక్కరు ఉపయోగపడే పుస్తకాలు ఉన్నాయని ముఖ్యంగా పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు గ్రంథాలయంలో మీకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. గ్రంథాలయానికి తప్పకుండా రావాలని కోరారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పూర్తిగాని డ్రైనేజీ పనులు..

- రోడ్ పైకి వస్తున్న మురుగునీరు..
- దోమల,ఈగలతో ఆగమాగం అవుతున్న మండల ప్రజలు
- వెంటనే డ్రైనేజీ పనులు పూర్తి చేయించాలని...
- ఆర్ అండ్ బి సూపరిండెంట్ ని కలిసిన
- సర్పంచ్ మర్రి సంధ్యమల్లారెడ్డి, ఉపసర్పంచ్ శివారెడ్డి....

**అశ్వాపురం, మే 15, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంటలో మెయిన్ రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ పనుల అసంపూర్తిగా వదిలేయడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి నిలుస్తున్నదని . దీనికి తోడు పారిశుధ్య పనులు చేయడం కుదరకపోవడంతో దోమల బెడద ఎక్కువయింది. ఇప్పటికే నానా ఇబ్బందులు పడుతున్న ప్రజలు.వచ్చేది వానకాలం కావడంతో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. సంబంధిత డ్రైనేజీ గుత్తేదారు పనులను మధ్యలోనే ఆపేయడంతో గ్రామస్థులు అవస్థలు పాలవుతున్నారు . అసంపూర్తిగా నిలిచిన డ్రైనేజీ పనులపై ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు గుత్తేదరుని ఫిర్యాదు చేసిన నిమ్మకి నీరెత్తినట్లుగా వస్తున్నారని. వాపోతున్న మండుకుంటవాసులు వెంటనే డ్రైనేజీ పనులు పూర్తి చేయించాలని కోరుతూ మొండికుంట గ్రామపంచాయతీ సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి మరియు ఉపసర్పంచ్ శివారెడ్డి ఆర్ అండ్ బి సూపరిండెంట్ ని కలిసి మెమొరండం అందజేశారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు,పెద్దలు పాల్గొన్నారు.

